# పోలీ శాంతీ మియా వీరా?

ఎవరన్నారో, ఎందుకన్నారో తెలీదుగానీ, అలా నోరు నెప్పిజేసి దవళ్ళు వాచేలా - అనగా అనగా ఒకరాజు అప్పుడే సాయంత్రాన్ని సాగనంపేసిన ఒకరోజు ప్రపంచాన్ని చల్లగాను, ప్రేమికుల్ని వేడిగానూ పరిపాలించటం ప్రారంభించేరు. ఆ రాజుగారి చూపులు విస్తృతంగా విస్తరించి విశాలంగా, విలాసంగా వున్నాయి. అది విశాఖపట్నంలో 'లాసన్స్ బే' తీరంలో వున్న శాంతి ఆశ్రమంలోనికి కూడా చొచ్చుకుని, అక్కడ ఏపుగా పెరిగిన సరుగుడు చెట్లని వొరుసుకుంటూ వచ్చి నేల మీదికి జారేయి. అప్పుడా చెట్ల మధ్య ఓ చెట్టు నానుకుని ఠీవిగా రాజాలా కూర్చున్న సారధి కూడా ఆ రాజులాగే ఎంతో అందంగా వున్నాడు.

ఆ రాజు నెలరాజు.

ఆ రోజు పున్నమిరోజు.

ఆ చూపులు వెన్నెల తూపులు.

ఆ సారధి మెడికల్ కాలేజీలో ట్యూటరు.

ప్రస్తుతం శాంతి ఆశ్రమంలో సరుగుడు చెట్టు క్రింద కూర్చున్న సారధి చేతుల్లో ఒక అందమైన మాసపత్రిక వుంది.

శ్రద్ధగా అందులో సీరియల్ చదువుకుందామని సాయంత్రం అయిదింటి కల్లా సారధి అక్కడికి వచ్చేడు. కాని సీరియల్ సగం చదివేసరికి సారధికి ఎంత ప్రయత్నించినా ఒక్క అక్షరం కూడా ముందుకి సాగలేదు. కారణం ఆ పేజీలో హఠాత్తుగా హీరోయిన్ బామ్మ మరణించింది. సారధికి వెంటనే తన బామ్మ గుర్తుకొచ్చింది. చేతిలో పుస్తకం మూసి, గతంలోకి జరిగి సారధి తన బామ్మ గురించి చాలాసేపు ఆలోచించేడు. సంధ్య గడిచేవరకూ ఆలోచించేడు. కాస్సేపు

ఆలోచనలో ఆలోచన పేర్చుకుంటూ, ప్రొఫెసరు గారి గదిలోకి అడుగుపెట్టాడు. టేబులు వెనక కుర్చీలో ప్రొఫెసరుగారు సర్కసు పులిలా కూర్చుని పూరీలు తింటూ, ఛటర్జీ ముందేసుకుని దీక్షగా 'సి.ఎస్.ఎన్.' బట్టీ పడుతున్నారు. సారధిని చూడగానే ఆయన పూరీప్లేటు చటుక్కున దాచేసి, చదివే పేజీల మధ్య గుర్తు కోసం ఒక పూరీవేసి, పుస్తకం మూసేసి, గాంద్రుమని దగ్గేరు. పులిగా మారినప్పుడల్లా యిలా ప్రొఫెసరుగారు ఆస్త్మా పేషెంటులా అల్లరి చేస్తారని డిపార్టుమెంటంతకీ బాగా తెలుసు.

సారధి కంటిముందు పడగానే ప్రొఫెసరుగారు యింగ్లీషులో యింగ్లీషు పులిలా గర్జించేరు – 'ప్రొద్దున్న ఏం తీసుకున్నావ్?'

సారధి సవినయంగా అన్నాడు 'చపాతీ సార్.'

షటప్ 'ప్ఛ్ చపాతీ కాదు నే నడిగింది' ఈసారి ప్రొఫెసరుగారు గర్జించినపుడు సారధి మీద చినుకులు పడ్డాయి. (కండిషన్‌డ్ రిఫ్లెక్సు) 'క్లాసులో తీసుకున్న సబ్జక్టేమిటి – చెప్పిన భాగోతమేమిటి అని అడుగుతున్నా?'

సారధి ఇంకా వినయం మానలేదు 'భాగోతం కాదు సార్ – బ్లడ్!'

'బ్లడ్డే బ్లడ్డు బ్లడ్‌లో ఏ టాపిక్కు?'

'ఆర్.బి.సి. సార్!'

'ఇంటి దగ్గర ప్రిపేరయ్యే వచ్చావా!'

'అవును సార్!'

'మరయితే క్లాసులో ఆ పేలాపనేవిటి?'

'తప్పు చెప్పానా సార్?'

ఒక్కసారి ప్రొఫెసరుగారు కుర్చీలోంచి లేచి వొళ్ళు దులుపుకున్నారు. 'తప్పా! తప్పున్నరా? రక్తంలో ఎర్రకణాలేకాక ప్రేమకణాలు కూడా ఉంటాయా? వాటిపేరు శాంతికణాలా? అవి మూడు రకాలా! పైగా రక్తంలో అవి బాగా ఎక్కువగా తగులబడితే 'పోలీ శాంతీ మియా వీరా' అనే రోగం అఘోరిస్తుం దంటావా?' అంటూ దసరా పులి డ్యాన్సు చేశారు – పిమ్మట ఆయన యింకా యిలా డ్యాన్సు చేశారు.

ఎర్ర కణాలన్చెప్పి బోర్డు మీద ఆఠీను బొమ్మ లేస్తావా? పైగా యివన్నీ నేను చెప్పమన్నానని చెబుతావా? అసలేమిటి నీ వుద్దేశ్యం' అంటూ ఆయాస పడ్డారు.

